## క్లుప్తంగా

### డీఎంఅండ్‌హెచ్‌ఓను కలిసిన ఎంపీపీ

పెద్దపంజాణి: జిల్లా ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్ ఓగా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్ రెడ్డిని పెద్దపంజాణి ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప సోమవారం చిత్తూరులోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పెద్దపంజాణి ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు ఉన్నారు.

### ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సత్కారం


డీఎం స్వామిని సన్మానిస్తున్న నేతలు

కుప్పం: బదిలీపై వెళుతున్న కుప్పం ఆర్టీసీ డిపో మేనేజర్ స్వామిని ఎస్ఎంయూ నేతలు, మున్సిపల్ చైర్మన్ సుధీర్ సోమవారం ఘనంగా సత్కరించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎంయూ నాయకులు జయపాల్, మునుస్వామి, ప్రసాద్ కుమార్, మునెప్ప, తదితరులు పాల్గొన్నారు.

### సారా విక్రేత అరెస్టు

పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాప్పల్లి పంచాయతీ పెనుగొలకల గ్రామంలో కర్ణాటక మద్యం, సారా విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. గ్రామంలో వెంకటప్ప కుమారుడు వెంకటేష్ కర్ణాటక మద్యంతో పాటు సారా విక్రయిస్తున్నాడనే సమాచారంతో అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అతని వద్ద కర్ణాటక మద్యం 20 టెట్రా ప్యాకెట్లు, 30 సారా ప్యాకెట్లు (100 ఎంఎల్) స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం పుంగనూరు కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ వివరించారు.

### ఇద్దరిపై కేసు నమోదు

చౌడేపల్లె: ఘర్షణకేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ సోమవారం తెలిపారు. గత నెల 17వ తేదీ అంకుతోటపల్లెకు చెందిన రెడ్డెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన అంజప్ప, నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. వీరిద్దరినీ అరెస్టు చేసి పలమనేరు కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు.

### మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్రబాబు

పలమనేరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపుతో మున్సిపాలిటీల పరిధిలో సాగుతున్న జీపుజాతా సోమవారం పలమనేరుకు చేరుకుంది. లక్ష్మీనగర్ వద్ద ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఆలస్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు సురేంద్ర, గోవిందరాజులు, మంజుల, నరసింహులు, ఓబుల్‌రాజు పాల్గొన్నారు.

### సారా ధ్వంసం

రామకుప్పం: మండలంలోని బోడికదిరిబండ, బోదగుట్ట వంక ప్రాంతాల్లో సోమవారం అటవీశాఖ అధికారులు దాడి చేసి సారా బట్టీలను ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని కుప్పం రేంజి అధికారి వైసీ రెడ్డి హెచ్చరించారు.

### గంగజాతర ప్రారంభం

నదుం: మండల కేంద్రంలో దాసరి సామాజిక వర్గీయులు నిర్వహించే గంగజాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. మహిళలు ఊరేగింపుగా అంబలిని తీసుకువెళ్లి భట్టువారిపల్లె సమీపంలోని గంగమ్మ ఆలయంలో నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. మంగళవారం జాతర నిర్వహించనున్నారు.

### తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి


మరమ్మతులు చేయిస్తున్న సిబ్బంది

సోమల: పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్ భారతి తెలిపారు. మండలంలోని పెద్ద ఉప్పరపల్లె టౌన్ దిగువ వీధిలో బోర్ మోటారు పాడైపోవడంతో సోమవారం మోటారు మరమ్మతు చేయించి, సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ గణపతి, పంచాయతీ కార్యదర్శి మసూదా బేగం తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పుంగనూరు: మొక్క నాటుతున్న న్యాయమూర్తి వాసుదేవరావు, పక్కన కమిషనర్ నరసింహప్రసాద్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో..

పలమనేరు: పర్యావరణ పరిరక్షణే మానవాళికి శ్రీరామరక్ష అని పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అధికారులతో కలిసి మొక్కలను నాటారు. ఆమె మాట్లాడుతూ... పట్టణాలు కాంక్రీట్ జంగిళ్లుగా మారాయని, ఇప్పటికైనా సమాజం స్పందించకపోతే భవిష్యత్తులో గాలిని కూడా కొనాల్సిన పరిస్థితి రావచ్చునన్నారు. మానవ మనుగడ పర్యావరణంతో ముడిపడి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటడం బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులతో కలిసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం, పలమనేరు ప్రకృతి నిర్వాహకులు మల్లిచెట్ల దేవేంద్ర, సీఐ చంద్రశేఖర్, ఎంపీడీఓ బాలాజీ పాల్గొన్నారు.

పుంగనూరు: పర్యావరణాన్ని పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు పిలుపునిచ్చారు. సోమవారం కోర్టు ఆవరణలో మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి, ఫారెస్ట్ అధికారులు రాకేష్, సురేంద్రతో కలసి మొక్కలు నాటారు. అలాగే మున్సిపాలిటీలో చైర్మన్ అలీమ్‌బాషా, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, అటవీశాఖ సిబ్బంది కలసి మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అలాగే మున్సిపల్ డంపింగ్‌యార్డ్ ఆవరణలో పర్యావరణశాఖాధికారి కృష్ణవేణి ఆధ్వర్యంలో క్యూబయో ఎనర్జీ వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వాసుదేవరావు మాట్లాడుతూ పట్టణంలో ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గల్లా శివశంకర్ నాయుడు, వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మున్సిపల్ వైస్ చైర్మన్లు లలిత, నాగేంద్ర పాల్గొన్నారు.

**రొంపిచెర్లలో ర్యాలీ**

రొంపిచెర్ల: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ సూచించారు. ఆయన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, పీహెచ్ఎన్ పార్వతమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

**సోమలలో..**

సోమల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పీహెచ్‌సీ వైద్యాధికారులు జయసింహ, శివప్రతాప్ అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేసి, మొక్కలు నాటారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జయరాం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చిన్నప్ప, రహీమా, గీత, రోజా, అధ్యాపకులు సత్య నారాయణ, ఈవీఆర్ నాయక్, సుధ పాల్గొన్నారు.

**నదుంలో..**

నదుం: మండలంలోని చెరుకువారిపల్లెలో ఏపీ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం కార్యదర్శి చంద్రమ్మ మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని, పొలాల వద్ద కందకాల తవ్వకానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సభ్యులు కాంతమ్మ, మంగమ్మ, రాజమ్మ, కృష్ణమ్మ పాల్గొన్నారు.

**ఘనంగా పర్యావరణ దినోత్సవం**

కుప్పం: పట్టణంలని కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. కాలేజీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి వైసీ రెడ్డి, విశ్రాంత ఉద్యోగి ఉపేంద్ర పాల్గొన్నారు.

**ఇంజినీరింగ్ కళాశాలలో..**

కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ సాగర్ రాజ్ పాల్గొన్నారు.

**సామాజిక బాధ్యతతో మొక్కలు నాటాలి**

శాంతిపురం: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు కోరారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రేసీ మేరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుంకమాకనపల్లె వద్ద మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ సుకుమార్, వైస్ ఎంపీపీ పట్టాభి, సర్పంచ్ చంగమ రాజు, ఏఎంసీ డైరెక్టర్ మురుగేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర



పుంగనూరు: మున్సిపాలిటీలో ప్రతిజ్ఞ చేస్తున్న నాగభూషణం, అలీమ్‌బాషా, రొంపిచెర్లలో ర్యాలీ



కేఈసీలో సీఈఓ సాగర్ రాజ్, మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు

### మహిళా చట్టాలపై అవగాహన

పలమనేరు: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పారాలీగల్ వలంటీర్ ప్రమీల అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎవరికైనా అన్యాయం జరిగితే బాధితుల తరఫున పోరాడేందుకు స్వచ్ఛంద సంస్థలతో పాటు పారాలీగల్ వర్కర్లు పాత్ర కీలకమన్నారు. మహిళలకు జరిగే అన్యాయాలపై భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. నిరుపేదలకు కోర్టులో ఉచిత న్యాయ సహాయం దొరుకుతుందని తెలిపారు.

### ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలి


నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పలమనేరు: మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని స్థానిక ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఆర్ జ్యోతి డిమాండ్ చేశారు. రెజ్లర్లపై పోలీసులు దాష్టికంపై స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఆమె మాట్లాడుతూ..తప్పు చేసిన ఎంపీని కేంద్రం ఎందుకు రక్షిస్తోందని ప్రశ్నించారు. దేశ ప్రతిష్ట కోసం కష్టపడే మహిళా మల్లయోధులకు ఈ ప్రభుత్వం గౌరవం చూస్తుంటే బాధగా ఉందన్నారు. వారికి న్యాయం జరిగేదాకా తాము మద్దతుగా నిలుస్తామని తెలిపారు. నాయకులు యోగేష్‌బాబు, జానకి, శకుంతల, లక్ష్మీదేవి, శాంతి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. సోమవారం మండలంలోని బందార్లపల్లె పంచాయతీ గోవిందరాజపురం, వినాయకపురం గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. బందార్లపల్లె పంచాయతీకి అదనపు నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం వాహనమిత్ర పథకం కింద లింగాపురం గ్రామానికి చెందిన వరలక్ష్మి గ్రూపునకు సబ్సిడీపై మంజూరు చేసిన ట్రాక్టరును అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆరేళ్ల జయప్ప, పార్టీ మండల కో-కన్వీనర్ చంద్రారెడ్డి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, సర్పంచ్ రాజ్‌గోపాల్, ఎంపీటీసీ సభ్యులు సౌమ్య, నేతలు రామలింగారెడ్డి, రామకృష్ణారెడ్డి, సురేంద్ర రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు, నారాయణ స్వామి పాల్గొన్నారు.



వలంటీర్లను సత్కరిస్తున్న విజలాపురం బాబురెడ్డి, వలంటీర్లను సన్మానిస్తున్న నేతలు

### వలంటీర్లకు సన్మానం

రామకుప్పం: మండలంలోని విజలాపురం గ్రామ సచివాలయంలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సోమవారం ఘనంగా సత్కరించారు. సర్పంచ్ విజలాపురం బాబురెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్లకు సేవామిత్ర అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు వెంకట్రామేగౌడ్, చలపతి, పంచాయతీ కార్యదర్శి బాబు, నేతలు జనార్దన్‌రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గుడుపల్లె: మండలంలోని బెగ్గిలిపల్లె గ్రామం సచివాలయ పరిధిలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను సింగల్ విండో మాజీ చైర్మన్ నాగభూషణం, కార్యదర్శి చంద్రప్ప సోమవారం ఘనంగా సన్మానించారు. రూ.10వేల చొప్పున నగదు బహుమతులను పంపిణీ చేశారు.

### మంత్రి కాకాణితో భేటీ

పలమనేరు: రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో సోమవారం కలిసినట్లు పలమనేరు ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. పలమనేరు ఇంటిగ్రేట్ టమాట మార్కెట్‌కు సంబంధించిన సీఎఫ్ఎంఎస్ క్లియరెన్స్‌పై ఆయనకు విన్నవించామని తెలిపారు. పట్టణ సమీపంలో 33 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణ పనులు, శివునికుప్పం వద్ద మ్యాంగో మార్కెట్ నిర్మాణ పనులను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## పశు వైద్యాధికారుల నిర్లక్ష్యం.. నీరుగారుతున్న ఆశయం

రొంపిచెర్ల: పశు వైద్యాధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతుంది. మండలంలోని మోటోళ్లపల్లెలో సోమవారం పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ పట్టణం జిల్లా స్త్రైల్ సంయుక్త సంచాలకుడు రమణయ్య హాజరయ్యారు. పాడి రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మొత్తం 23 మంది హాజరైతే వారిలో పశు వైద్య సిబ్బంది 8 మంది ఉన్నారు. కనీసం 15 మంది రైతులు కూడా హాజరు కాక పోవడంపై పలువురు మండి పడుతున్నారు. మండల పశు వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణమని పాడి రైతులు వాపోతున్నారు. ఈ విషయమై పశువైద్యాధికారిని వివరణ కోరగా పశువిజ్ఞాన బడి కార్యక్రమానికి కేవలం 10 మంది పాడి రైతులు ఉంటే చాలన్నారు. అయితే సోమవారం జరిగిన కార్యక్రమానికి సుమారు 30 మంది హాజరయ్యారన్నారు. తాను సెలవులో ఉన్నానని ఈ రోజే వచ్చానని తనకు ఆ రోజు సమాచారం ఇచ్చారని డాక్టర్ తెలిపారు.


పశువిజ్ఞాన బడి గ్రామసభలో పాల్గొన్న అధికారులు

### నాడు-నేడు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి

బైరెడ్డిపల్లె: మండల పరిధిలో జరుగుతున్న నాడు-నేడు పనులను వైఎస్సార్‌సీపీ రాజంపేట ఎన్నికల పరిశీలకుడు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి సోమవారం పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది నాణ్యమైన విద్య అందిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు అరాచక పాలనలో జనం విసిగిపోయారని.. టీడీపీకి శాశ్వతంగా సమాధి కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

### వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దాం

పలమనేరు: పట్టణంలో వైఎస్సార్‌సీపీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలతో కలిసి కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ఎస్‌కేఎస్ జాఫర్ అన్నారు. గంటావూరులో సోమవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, కౌన్సిలర్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్లు కోదండరామయ్య, రహీంఖాన్, శ్యామ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

### శివాలయంలో ప్రత్యేక పూజలు


విశేషాలంకరణలో శివలింగం

చౌడేపల్లె: మండల కేంద్రంలోని అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులైన రాజశేఖర దీక్షితులు, కుమార స్వామి, మహేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవమూర్తులకు, శివలింగానికి అభిషేకాలు, పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

### రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం


విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

సోమల: రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ ఈశ్వరయ్య అన్నారు. సోమవారం మండలంలోని కందూరు ఆర్బీకేలో ప్రభుత్వం రాయితీతో సరఫరా చేసిన మొక్కజొన్న విత్తనాలను సర్పంచ్ మసూద్‌తో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏహెచ్ఏ అనూష, నేతలు భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, రత్నశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీ చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

పుంగనూరు: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్షుడు చెంగారెడ్డి కోరారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పింఛన్ ఒకటో తేదీనే చెల్లించాలని కోరారు. అలాగే విశ్రాంత ఉద్యోగులు తక్షణమే ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భరత్‌భూషణ్, కేశవరెడ్డి, చంద్రశేఖర్, వెంకటపతి, ఈశ్వర్‌రెడ్డి, గంగులమ్మ, ద్వారకమ్మ, లీలావతి, ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు


ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

● ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని..గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. కొంగాటం గ్రామ సచివాలయం పరిధిలోని కొంగాటం, పిచ్చిగుడ్లపల్లి, కొండేపల్లి, కారకుంట కొత్తూరు, మండలకుంట గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొత్తం 787 గృహాలను సందర్శించారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగునీటి సమస్య, విద్యుత్ వైర్లు, వీధిలైట్లు, తాగునీరు, పింఛన్లు, ఇంటి పట్టాలు, రోడ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఆయా సమస్యలను సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సాంకేతిక లోపాలతో ఎవరికైనా పథకాలు వర్తించని పక్షంలో వెంటనే అందేలా కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో రూ.70 కోట్ల వ్యయంతో సీసీరోడ్లు, మురుగునీటి కాలువలను నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, సర్పంచ్ అనితారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్, నాయకులు జయరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కిషోర్‌కుమార్, కృష్ణమూర్తి, ఎంపీటీసీలు కమల్, సమ్మద్, ఏఎంసీ డైరెక్టర్‌లు వేణు, మణి, రెస్కో డైరెక్టర్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పుంగనూరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన సాగుతోందని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము తెలిపారు. సోమవారం యూబీ కాంపౌండ్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నపిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. అలాగే గర్భిణులు, బాలింతలకు జగనన్న పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాఠశాలలకు మహర్దశ వచ్చిందన్నారు. ఎన్నడులేని విధంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ పాఠశాలలుగా మార్చారని చెప్పారు. అలాగే నాణ్యమైన భోజనాన్ని పాఠశాలల్లో అందించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అయిషా పాల్గొన్నారు.


పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న నేతలు

## మంత్రి పెద్దిరెడ్డి పర్యటన ఏర్పాట్ల పరిశీలన


బోయకొండలో అభివృద్ధి పనులను పరిశీలించి సూచనలిస్తున్న పెద్దిరెడ్డి

చౌడేపల్లె: మండలంలో ఈ నెల 8వ తేదీన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో ఆయన పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సోమవారం పరిశీలించారు. తొలుత చౌడేపల్లె సమీపంలోని దొరబావితోట వద్ద రూ.1.60 కోట్ల వ్యయంతో నిర్మించిన సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ సముదాయాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం బోయకొండలో జరుగుతున్న విద్యుత్, భవన నిర్మాణ పనులను పెద్దిరెడ్డి పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీడీఓ సుధాకర్, ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్, బోయకొండ ఈఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## పీఎంపీ అధ్యక్షుడిగా రామచంద్ర

పలమనేరు: కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పలమనేరు డివిజన్ అధ్యక్షుడిగా రామచంద్ర ఎంపికయ్యారు. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకర్ అధ్యక్షతన స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో సోమవారం డివిజన్ సర్వసభ్య సమావేశం జరిగింది. డివిజన్ నూతక కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ఉపాధ్యక్షుడిగా రఘు, ప్రధాన కార్యదర్శిగా మనోహరుడు, సహాయ కార్యదర్శిగా మస్తాన్, కోశాధికారిగా అరుణకుమారి, కార్యవర్గ సభ్యులుగా కిశోర్, చరణ్, సంతోష్, అష్రఫ్, మేరీ, ఖైరున్నీసా, సలహాదారులుగా మణి, మంజుల, జయంతి, రజినీకాంత్, కోదండనాయుడు, వరదరాజులులను ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్, కోకన్వీనర్ దామోదర్‌రెడ్డి, జనార్ధన్ పాల్గొన్నారు.